క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్య పరిష్కారానికి కృషి

- ఈవో శ్రీనివాసమూర్తి


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాలను శనివా రం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య తదితర వివరాలను అడిగి తెలుసుకున్నా రు. అలాగే మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని ప్రధానోపాధ్యాయురాలు భాను ఈవో దృష్టికి తీసుకెళ్లారు. అలాగే జీతాల అంశాన్ని కూడా వివరించారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఈవో తెలిపారు. ఆయన వెంట ఏఈవో నరసింహరాజు, ఈఈ రాంబాబు, ఏఈ రవిరాజు ఉన్నారు.

విద్యార్థినికి అభినందన


జాతీయ ఖోఖో పోటీలకు ఎంపికైన లాస్యతో ఉపాధ్యాయులు

పరవాడ: దేశపాత్రునిపాలెం జెడ్పీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కూండ్రపు లాస్య జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ఖేలో ఇండి యా ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్.సుజాత చెప్పారు. త్వరలో తెలంగాణలో జరగనున్న పోటీలకు లాస్య హాజరవుతుందని పాఠశాల పీడీ దేవి చెప్పారు. ఈ మేరకు లాస్యను అభినందించారు.

భవ్యశ్రీ మృతికి కారకులను శిక్షించాలని నిరసన


తానాంలో నిరసన తెలుపుతున్న మహిళలు

పరవాడ: చిత్తూరు జిల్లాలో కలకలం రేపిన ఇంటర్ విద్యార్థి భవ్యశ్రీ అనుమానాస్పద మృతి కేసును పక్కాగా విచారించి ముద్దాయిలను కఠినంగా శిక్షించాలని అనకాపల్లి జిల్లా రజక సంఘ అధ్యక్షుడు అడ్డూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లా రజక సంఘం ఆధ్వర్యంలో తానాం గ్రామంలో నిరసన కార్యక్ర మం చేపట్టారు. శ్రీనివాసరావు మాట్లాడు తూ భవ్యశ్రీ మృతికి కారకులైన వారిపై కఠిన చట్టాలను ప్రయోగించి శిక్షలు పడేవిధంగా చూడాలన్నారు.

అతి పే..ద్ద అరటి గెల


ఎంవీపీ రైతు బజార్‌లో 300 పండ్లతో అరటి గెల

ఆరిలోవ: ఎంవీపీ రైతు బజార్‌కు శనివారం 300 పండ్లతో పెద్ద అరటి గెలను ఓ రైతు తీసుకొచ్చాడు. కోటవురట్ల మండలం విశ్వనాథపురం గ్రామానికి చెందిన శ్రీను అనే రైతు ఇక్కడ బజార్‌కు తీసుకొచ్చిన సుమారు మూడున్నర అడుగులకు పైగా పొడవున్న ఈ అరటి గెలకు 16 పెడలు ఉన్నాయి. దానికి సుమారు 300 అరటి పండ్లు ఉన్నాయి. సాధారణంగా అరటి గెలకు 7 నుంచి 10 వరకు పెడలు, 150 నుంచి 180 వరకు పండ్లు ఉంటాయి. సపోటా ముకిరీ అనే పిలిచే ఈ గెలకు మాత్రం 16 పెడలున్నాయి.

వేతనాల జాప్యంపై ఆగ్రహం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు సెప్టెంబర్ నెలాఖరుకు జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమని స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ఏఐటీయూసీ మిత్రపక్షాల నాయకులు అన్నారు. ప్రతీ నెలా 30, 31 తేదీల్లో జీతాలు చెల్లించేవారన్నారు. శనివారం జీతాలు చెల్లించాలని యాజమాన్యానికి తెలిసినా బ్యాంకులకు వడ్డీ చెల్లించకపోతే డిఫాల్టర్ అవుతామని, జీఎస్టీ చెల్లించకపోతే స్టీల్ ప్లాంట్ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతుందని చెప్పడం సరికాదన్నారు. యాజమాన్యం చర్యకు నిరసనగా అక్టోబర్ 2న యాజమాన్యం నిర్వహించే గాంధీ జయంతిని గుర్తింపు యూనియన్ బహిష్కరించి, వేరుగా నిర్వహిస్తామని తెలిపారు.

ప్రజలకు రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష

- పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించడమే సీఎం జగన్ లక్ష్యం
- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- పినగాడి, పరవాడ, గొటివాడలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రారంభం

పెందుర్తి నియోజకవర్గంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు శనివారం ప్రారంభమయ్యాయి. ప్రత్యేక వైద్యులతో కూడిన బృందం ఆయా శిబిరాల్లో సేవలందించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ స్వయంగా పాల్గొని పెందుర్తి మండలం పినగాడితో పాటు పరవాడ జెడ్పీ హైస్కూల్, సబ్బవరం మండలం గొటివాడలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రారంభించారు. ఆయన కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వందలాది మంది శిబిరాల్లో వైద్య సేవలు పొందారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు కూడా చేయనున్నారు.


వివరాలు నమోదు చేసుకుంటున్న రోగులు


పినగాడిలో జగనన్న ఆరోగ్య సురక్ష పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: వైద్య రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిది అయితే.. ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి వైద్య రంగంలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. పెందుర్తి మండలం పినగాడిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్య రంగం గురించి మాట్లాడితే తొలుత గుర్తువచ్చే వ్యక్తి స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డే అని అన్నారు. ఆరోగ్యశ్రీ తీసుకొచ్చి ప్రతీ ఒక్కరి గుండెల్లో నిలిచారన్నారు. ఆయన మరణించిన తర్వాత వచ్చిన ప్రభుత్వాలు వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేసి, 108 సేవలను నిర్వీర్యం చేసిన పరిస్థితులను చూశామన్నారు. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన తండ్రి ఆశయాలకి అనుగుణంగా మరిన్ని అడుగులు ముందుకేసి దేశచరిత్రలో ఎక్కడా లేని విధంగా వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయరంగానికి పెద్ద పీట వేశారన్నారు. కొన్నివేల పోస్టులు వైద్యరంగంలో భర్తీ చేశారని చెప్పారు. అర్బన్ పీహెచ్‌సీలతో పాటు ఆరోగ్యశ్రీ పరిధిలో మరిన్ని వ్యాధులను చేర్చి పేదల వైద్యానికి భరోసా కల్పించారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ తీసుకొచ్చారన్నారు. తాజాగా మరో అడుగు ముందుకేసి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. వైద్య సిబ్బందిని ఇంటికే పంపించి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకోవడంతో పాటు సురక్ష క్యాంపులు ఏర్పాటు చేసి స్పెషలిస్టు వైద్యులతో సేవలు అందించడం కొత్త చరిత్ర అన్నారు.

వైద్యులు డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి(జనరల్ మెడిసన్), డాక్టర్ జె.సుధీర్(ఆర్థో), డాక్టర్ పి.పద్మ, డాక్టర్ బి.రమేష్, డాక్టర్ బాలాజీ, డాక్టర్ అనశ్రీ(అప్తమాలజీ), ఎంపీహెచ్‌వో పరమేశ్వరరావు వైద్య సేవలు అందజేశారు. మొత్తం 235 మంది శిబిరానికి వచ్చారు. 335 టెస్టులు నిర్వహించారు.

ఈవిధానం దేశంలో ఎక్కడా లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మదుపాడ నాగమణి, జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు బైలపూడి భగవాన్ జయరామ్ దంపతులు,వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నక్క కనకరాజు, గొరపల్లి సర్పంచ్ గొరపల్లి శ్రీను, ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్, ఎంపీడీవో సుజాత, తహసీల్దార్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

460 మందికి వైద్య సేవలు

పరవాడ: ప్రజారోగ్యమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ పని చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. పరవాడ బాలుర జెడ్పీ పాఠశాలలో తొలి దశలో శనివారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష శ్రీరామ రక్షని చెప్పారు. ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య పరీక్షలు జరిపి మందులు అందజేయడంతో పాటు అవసరమైన రోగులకు ఉచితంగా ఆపరేషన్లు చేస్తారన్నారు. 460 మందికి ప్రత్యేక వైద్యాధికారులు డాక్టర్ మోహన్‌రావు


పరవాడలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు పల్స్ పరీక్ష చేస్తున్న వైద్యులు

(ఆర్థోపెడిక్), డాక్టర్ విష్ణుప్రియ (గైనాకాలజిస్ట్), పరవాడ, వాడచీపురుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు ఐ.ఆర్.రంజిత్, కనకప్పారావు వైద్య పరీక్షలు చేశారు.

అభినందన

సబ్బవరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహారం, ఎస్‌డీజీ గోల్స్‌కు సంబంధించిన స్టాల్స్‌ను ఎమ్మెల్యే పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా పరీక్షలు చేసి 39 మందికి కళ్లద్దాలు, ఒకరికి కంటి ఆపరేషన్‌కు వైద్యులు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, తహసీల్దారు పి.కనకారావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, ఉప సర్పంచ్ బండారు రామారావు, ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్ చల్లా కనకారావు, పార్టీ నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పెదిశెట్టి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగానికి పెద్దపీట

సబ్బవరం: విద్య, వైద్య, ఆరోగ్య రంగాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని గొటివాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ


రోగులకు మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది


రోగుల కేస్ షీట్‌లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ గ్రామ స్థాయిలోనే మెరుగైన వైద్యం అందిచడం జరుతుందన్నారు. 15 రోజులుగా వలంటీర్లు,వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించి వారికి టోకెన్లు అందించారన్నారు. వారికి వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన శస్త్ర చికిత్సలను కూడా ప్రభుత్వమే చేయిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి,సర్పంచ్ సాలాపు మీణ, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్,వైఎస్సార్ పార్టీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, ఎంపీడీవో రమేష్ నాయుడు, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు,పార్టీ సీనియర్ నాయకులు సాలాపు వెంకటేశ్వరరావు,బోకం రామునాయుడు,మండల ప్రత్యేక అధికారి కిరణ్ కుమారి, తహసీల్దార్ సత్యనారాయణ, పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

బండారు నీచ ఆరోపణలు మానుకో..

- మీ ఇంట్లో మహిళలు ఉన్నారని గుర్తించుకో
- బాబు ప్రాపకం కోసం దిగుజారుడు వ్యాఖ్యలు చేస్తావా?
- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజాను ఉద్దేశించి మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి చేసిన వ్యాఖ్యలు అతని నీచస్థితికి అద్దం పడుతున్నాయని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ విమర్శించారు. పెందుర్తి మండలం పినగాడిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆరోపణలు హుందాగా ఉండాలని, మహిళ అని కూడా చూడకుండా బండారు మాట్లాడిన తీరు గర్హనీయంగా ఉందన్నారు. జెర్రిపోతులపాలెంలో దళిత మహిళను వివస్త్రను చేసిన సంఘటన టీడీపీ హయాంలోనే జరిగిందన్నారు. కాల్‌మనీ, సెక్స్‌రాకెట్, మహిళా తహసీల్దార్‌ను ఈడ్చుకొచ్చిన సంఘటనలు టీడీపీ పాలనలో చూశామన్నారు. కేవలం చంద్రబాబు వద్ద ఉనికిని చాటుకోవడం కోసమే బండారు నీచ ఆరోపణలు చేశారని మండిపడ్డారు. బాబు వద్ద ఎక్కువ మార్కులు పడకపోతే ఎన్నికల్లో పెందుర్తి సీటు ఎటు వెళ్తుందోనన్న భయంలో బండారు ఉన్నారని ఎద్దేవా చేశారు. మహిళలను కించపరిచేలా మాట్లాడే ముందు నీ ఇంట్లో కూడా మహిళలు ఉన్నారని గుర్తించుకోవాలని హితవు పలికారు. చంద్రబాబు తప్పు చేయకపోతే బెయిల్ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. చంద్రబాబు అరెస్టు అయినా టీడీపీ కార్పొరేటర్లు యాత్రకు వెళ్లడం కూడా చాలా విడ్డూరంగా ఉందన్నారు. నిరసన దీక్షల టెంట్లు వెలవెలబోతున్నాయని ఎద్దేవా చేశారు. స్పీకర్ సీటుకు కూడా గౌరవం ఇవ్వని వ్యక్తి బాలకృష్ణ అని ఆరోపించారు. సమావేశంలో సమావేశంలో ఎంపీపీ మధుపాడ నాగమణి, జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, పినగాడి సర్పంచ్ వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు బైలపూడి భగవాన్ జయరామ్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షులను నియమించారు. ఈమేరకు కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. పెందుర్తి రూరల్ అధ్యక్షుడిగా నక్కా కనకరాజు, పెందుర్తి అర్బన్ (క్లస్టర్ 1,2)అధ్యక్షుడి జోబ్‌దాస్(చిన్ని), సబ్బవరం అధ్యక్షుడిగా కర్రి అప్పలనాయుడు, పరవాడ అధ్యక్షుడిగా కోన రామారావు నియమితులయ్యారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత


నగదు అందజేస్తున్న ఎర్ర వరహా నరసింహం తదితరులు

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలేనికి చెందిన లారీ డ్రైవర్ కేసాల నరసింహారావు ఒడిశాలో జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. అతడికి వైఎస్సార్ బీమా వర్తించడంతో తక్షణ సాయం కింద అతడి కుటుంబ సభ్యులకు శనివారం రూ. 10 వేలు అందజేశారు. కార్యక్రమంలో 530 సచివాలయ కన్వీనర్ కోరాడ ఈశ్వరరావు, వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, సచివాలయ సిబ్బంది, లంక సత్తిబాబు, కె.సింహాద్రి, బొట్టా శ్రీనివాసరావు, ఎస్.అప్పారావు, సిరిపురపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వం అవసరం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయకుమార్

సబ్బవరం: ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్- 19 జిల్లా స్థాయి ఆటల పోటీలకు క్రీడాకారుల ఎంపికను శనివారం నిర్వహించారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలను గురుకుల పాఠశా ల ప్రిన్సిపాల్ విజయకుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీధర్ ప్రారంభించారు. యోగ, . కేరమ్స్, చెస్, జిమ్నాస్టిక్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జి. రాంబాబు, పీడీ సీఎల్ఎన్ ప్రసాద్, పీఈటీ సూర్యనారాయణతో పాటు జిల్లాలోని పలు పాఠశాలల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

స్వరూపానందేంద్ర సరస్వతికి ఘన స్వాగతం


స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులు తీసుకుంటున్న అదీప్‌రాజ్


స్వరూపానందేంద్ర సరస్వతికి అప్పన్న ప్రసాదం అందజేస్తున్న ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు

సింహాచలం: ఉత్తరాఖండ్ రాష్ట్రం రిషికేష్‌లో చాతుర్మాస్య దీక్ష ముగించుకుని శనివారం విశాఖ చిన ముషిడివాడలోని శారదాపీఠానికి చేరుకున్న పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతికి పలువురు రాజకీయ ప్రముఖులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, వైస్సార్‌సీపీ నాయకుడు దాడి రత్నాకర్ స్వామీజీని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. సింహాచలం దేవస్థానం తరఫున ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో వీబీవీ రమణమూర్తి స్వామీజీని కలిసి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామివారి ప్రసాదం అందజేశారు.

వైభవంగా నృసింహుడికి ఆర్జిత సేవలు


యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు నరసింహాచార్యులు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, శ్రీకాంతాచార్యులు తదితరులు ఈసేవ నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఆలయ కల్యాణమండపంలోని గరుడవాహనంపై అధిష్ఠంపజేశారు. అష్టోత్త శతనామావళి పూజ అనంతరం భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు.

వాడవాడలా అన్నసమారాధనలు


పాపయ్యరాజుపాలెంలో వడ్డిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు


అడవివరం శిడగంపేటలో వడ్డిస్తున్న కర్రి అప్పలస్వామి


పరవాడ బీసీ న్యూ కాలనీలో అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు

సింహాచలం: వినాయక ఉత్సవాల్లో భాగంగా అన్నసమారాధనలు పోటాపోటీగా నిర్వహిస్తున్నారు. వేలాది మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. పలుచోట్ల శనివారం రాత్రి గణనాధుడి నిమజ్జనాన్ని విశేషంగా నిర్వహించారు.

- జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెంలో లవ్లీ బాయ్స్ ఆధ్వర్యంలో 2500 మందికి అన్నసమారాధన జరిగింది. కార్పొరేటర్ ముమ్మన దేముడు భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. గ్రామస్తులు రోమాల నూకరాజు, పేరూరి ప్రకాశం, రోమాల శ్రీను, కేవీఆర్ లక్ష్మి పాల్గొన్నారు.
- జీవీఎంసీ 98వ వార్డు అడవివరం శిడగంపేటలో శ్రీనివాసా యూత్ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ పాలక వర్గ సభ్యులు ఆకుల నాగరాజు, పాలూరి సూరిబాబు, మజ్జి ధర్మరాజు, శ్రీనివాసా యూత్ సభ్యులు శిడగం తాతబాబు, దొంతల సంతోష్, సన్ని తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధనలు

పరవాడ: గణపతి నిమజ్జనోత్సవాల్లో భాగంగా పరవాడ బీసీ న్యూ కాలనీలో గణపతి మండపం వద్ద యూత్ శనివారం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. పరవాడ, గొర్లివానిపాలెం, దిబ్బలగొర్లివానిపాలెం, వెన్నలపాలెం, సినిమాహాలు కూడలికి చెందిన వేలాది మంది భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. రాత్రికి గణపతి నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

- ముత్యాలమ్మపాలెం శివారు సమ్మెంగపాలెంలో ఎస్ఎంపీ యూత్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు ప్రారంభించారు. సమ్మెంగపాలెం పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మిసీతారామయ్య, ఓ.పోలమ్మ, తాతారావు, అప్పలరాజు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేతో భూ వివాదాలకు చెక్

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- రైతులకు పాసుపుస్తకాల అందజేత


రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: రైతుల మధ్య భూ వివాదాలను పరిష్కరించడంతో పాటు వారికి సంపూర్ణ హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణ చేపట్టిందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చెప్పారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సభలో జగనన్న శాశ్వత భూ హక్కు -భూ రక్ష పథకంలో భాగంగా శనివారం రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. మండలంలో సమగ్ర రీ సర్వే పూర్తయిన సుమారు 10 గ్రామాల రైతులకు పాసు పుస్తకాలను పంపిణీ చేసినట్టు చెప్పారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో శాటిలైట్, డ్రోన్ల ద్వారా సర్వే నిర్వహించి కచ్చితమైన కొలతలు,హద్దులతో రైతులకు పక్కాగా పట్టాదారు పాసు పుస్తకాలు అందించడం జరుగుతుందన్నారు.మండలంలోని మొగలిపురం, చింతగట్ల అగ్రహారం, గాలిభీమవరం, ఎరుకునాయుడుపాలెం, ఎ. శిరసపల్లి తదితర గ్రామాల రైతులకు ఈ పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, తహసీల్దార్ సత్యానారయణ, నాయకులు కొటాన రాము,కర్రి బాబు, పాలిశెట్టి సురేష్‌రాజ్, సబ్బవరపు ముత్యాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, బోకం రామునాయుడు, మోపాడ అప్పారావు పాల్గొన్నారు.

ముగిసిన సీంబెక్స్-23 వేడుకలు



సీంబెక్స్2023 పోస్టర్‌ను చూపుతున్న కమాండింగ్ ఆఫీసర్లు

సింధియా: సింగపూర్ ఇండియా మారిటైమ్ ద్వైపాక్షిక ఎక్సర్‌సైజ్ సెప్టెంబర్‌తో 28 ముగిసింది. భారత నౌకాదళ నౌకలు రణ్‌విజయ్, కవరత్తి, అలాగే జలాంతర్గామి, ఐఎన్ఎస్ సింధుకేసరిలు మారిటైమ్ ద్వైపాక్షిక ఎక్సర్‌సైజ్ 30వ ఎడిషన్‌లో పాల్గొనేందుకు సింగపూర్ వెళ్లిన సంగతి తెలిసిందే. ఇండియన్ నేవీ, రిపబ్లిక్ ఆఫ్ సింగపూర్ నేవీ మధ్య వార్షిక ద్వైపాక్షిక నావికా వ్యాయామం 1994 నుంచి నిర్వహిస్తున్నారు. హార్బర్ ఫేజ్‌లో విస్తృత శ్రేణి వృత్తిపరమైన పరస్పర చర్యలు, సంయుక్త విమానయానం, అగ్నిమాపక నష్ట నియంత్రణ వ్యాయామాలు, ఇరు దేశాల జలాంతర్గాముల రెస్క్యూపై జాయింట్ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసిజర్‌పై సంతకం చేసింది. సింగపూర్‌లో భారత హైకమిషనర్ అధికారులు, భారత నావికాదళ కమాండింగ్ అధికారులు, సింగపూర్ నేవీ ఫ్లీట్ కమాండర్లు, కారంజీ వార్ మెమోరియల్ వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.